## క్లుప్తంగా

### రేపు మండల సమావేశం

సీఎస్‌పురం(పామూరు): సీఎస్‌పురం మండల సర్వసభ్య సమావేశం స్థానిక మండల పరిషత్ సమావేశ హాలులో శుక్రవారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ మూడమంచు వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ సీహెచ్ రామచంద్రరావు తెలిపారు. సమావేశానికి జెడ్పీటీసీ, వైస్ ఎంపీపీలు, కోఆప్షన్ సభ్యుడు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరుకావాలన్నారు. అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో సమావేశానికి రావాలని కోరారు.

### పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం



యర్రారెడ్డిపాలెంలో మానవహారం నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

లింగసముద్రం: గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వైద్య, ఆరోగ్య సిబ్బంది సూచించారు. మండలంలోని యర్రారెడ్డిపాలెం, ఉట్లవారిపాలెం గ్రామాల్లో బుధవారం మలేరియా, డయేరియా, డెంగీ, చికెన్‌గున్యా వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కలుషిత నీటితో డయేరియా, మలేరియా వంటి వ్యాధుల బారిన పడే అవకాశం ఉందని, ప్రజలు కాచి చల్లార్చిన నీటిని తీసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను పాటించాలని సూచించారు. ఏఎన్ఎం ముబీనీభాను, ఎంఎల్‌హెచ్‌పి స్వాతి, ఆశా కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### చేతుల శుభ్రతతో ఆరోగ్యం

మర్రిపూడి: భోజనానికి ముందు, కాలకృత్యాల అనంతరం చేతులు శుభ్రపరుచుకుంటే ఆరోగ్యంగా ఉండవచ్చని సీహెచ్ఓ నాగేశ్వరరావు పేర్కొన్నారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అతిసారం, డెంగీ, మలేరియా తదితర సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని, ఇంటితోపాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని విద్యార్థులకు సూచించారు. అతిసారంతో బాధపడుతున్న వారికి ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించాలని అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో రమాదేవి, పుణ్యవతి, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

### గర్భిణులకు వైద్య పరీక్షలు



గర్భిణులను పరీక్షిస్తున్న డాక్టర్ కావ్య

జరుగుమల్లి(సింగరాయకొండ): జరుగుమల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఆరోగ్య సలహాలు అందించినట్లు వైద్యాధికారి కావ్య తెలిపారు. కార్యక్రమంలో భాగంగా 29 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశామని వివరించారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### నోట్‌బుక్స్, విద్యాసామగ్రి పంపిణీ

సీఎస్‌పురం(పామూరు): ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు బాసటగా దాతలు విద్యాసామగ్రిని సమకూర్చి అందజేయడం కొనియాడదగినదని హెచ్ఎం భారతి అన్నారు. మండలంలోని ఆనికాలపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బుధవారం జరిగిన కార్యక్రమంలో దాత గుంటిమడుగు శ్రీనివాసవర్మ తన సొంత నిధులతో సమకూర్చిన నోట్‌బుక్స్, కాపీరైటింగ్ బుక్స్, పలకలు, పెన్నులు, పెన్సిళ్లను హెచ్ఎం భారతి, ఉపాధ్యాయురాలు నారాయణం అలేఖ్యలు విద్యార్థులకు పంపిణీ చేశారు.

### అధికారుల సూచనలు పాటించాలి



ముప్పాళ్లపాడులో నిమ్మతోటలను పరిశీలిస్తున్న హెచ్ఓ

హనుమంతునిపాడు: పండ్ల తోటల రైతులు తెగుళ్ల నివారణకు అధికారుల సూచనలు, సలహాలు పాటించాలని ఉద్యానవన శాఖాధికారి ఎం అంజలిబాయి అన్నారు. మండలంలోని ముప్పాళ్లపాడులో సాగులో ఉన్న నిమ్మ, దానిమ్మ పండ్ల తోటలను పరిశీలించారు. నిమ్మ తోటలకు ఆకు ముడత, కాయకు మంగు, పేనుబంక, వేరుకుళ్లు, ఎండు పుల్ల, పల్లాకు, గజ్జి తెగుళ్లు ఉన్నట్లు పరిశీలించారు. తెగుళ్ల నివారణకు సూచనలు చేశారు. అధికారుల సూచనల మేరకు తెగుళ్ల నివారణకు మందులు పిచికారీ చేయాలని సూచించారు. ఎండు పుల్లను కత్తెరించి వేయాలన్నారు. నిమ్మకు తగినంత నీటిని అందించాలన్నారు. వీపీఏ డి.శారద, రైతులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి




హెచ్ఎంపాడులో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు




పామూరులో నిరసన తెలుపుతున్న నేతలు



కందుకూరులో ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

కందుకూరు: అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేయడంతో పాటు, అంగన్‌వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు ఎస్ఏ గౌస్ డిమాండ్ చేశారు. జాతీయ కోర్కెల దినంలో భాగంగా సీఐటీయూ, అంగన్‌వాడీ వర్కర్స్‌అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక అంకమ్మ దేవాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం అక్కడ ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం గత ఐదేళ్లలో ఐసీడీఎస్ ప్రాజెక్టుకు బడ్జెట్‌లో రూ.300కోట్లు కోత పెట్టిందన్నారు. ఎన్నికల తరువాత జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో అంగన్‌వాడీలను బలవంతంగా రాజీనామాలు చేయించడం, సెంటర్లకు తాళాలు వేయడం వంటి రాజకీయ వేధింపులు అరికట్టాలన్నారు. యూనియన్ నాయకులు పద్మ, అనూరాధ, చెంచులక్ష్మీ, కె కేశవకుమారి, ధనలక్ష్మి, షాహినా, శశి, ఉమామహేశ్వరి, మస్తానమ్మ, సీఐటీయు పట్టణ అధ్యక్షుడు రామ్మూర్తి, టి వెంకట్రావ్ తదితరులు పాల్గొన్నారు.

**గుడ్లూరులో...**

గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అంగన్‌వాడీల వేతనాలు పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేయాలంటే కేంద్ర బడ్జెట్‌లో రూ 50వేల కోట్లు కేటాయించి, ప్రభుత్వ ఉద్యోగులు, కార్మికులుగా గుర్తించాలన్నారు. అంగన్‌వాడీల ఆందోళనకు సీపీఎం నాయకులు దామా క్రిష్ణయ్య, ఎం వెంకటేశ్వర్లు, జి స్టాలిన్ మద్దతు తెలిపారు. సీఐటీయూ మండల అధ్యక్షురాలు షేక్ పద్మజ, అంగన్‌వాడీ నాయకులు గీత, ఎస్‌కే అమీరున్నీషా, రమాదేవీ, మరియా, లలిత, చిలకల మీనా, చిన్నామ్మాయి, భారతి, మంతు తులసి, ఎస్‌కే ఖాజాబి, జి.రాధమ్మ, ఎం ధయమ్మ పాల్గొన్నారు.

పామూరు: కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని కోరుతూ సీఐటీయూ జిల్లా కార్యదర్శి కొమ్మలపాటి మాల్యాద్రి ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేశారు. సీఐటీయూ నాయకుడు మాల్యాద్రి మాట్లాడుతూ దేశసంపదను సృష్టించే కార్మికులకు కనీస వేతనాలు అమలుచేయకుండా చాలీచాలని ఇస్తున్నారన్నారు. అనంతరం అంగన్‌వాడీలు, ఆయాలు, ఆశాలు, వీఆర్ఏలు నిరసన తెలిపి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ షేక్.షాకీర్‌పాషాకు అందజేశారు. నాయకులు అల్లాబక్షు, రామసుబ్బులు, రమీజా, రజియా, పద్మ, రాజ్యలక్ష్మి, పి.శ్రీను, నారాయణ పాల్గొన్నారు.

సీఎస్‌పురం(పామూరు): అంగన్‌వాడీలు, ఆయాలు, ఆశాలు, వీఆర్ఏలతో పాటు పలు రంగాల కార్మికులకు కనీస వేతనాలు ఇచ్చి ఆదుకోవాలని సీఐటీయూ మండల కార్యదర్శి ఎస్.తిరుపతిరెడ్డి అన్నారు. సీఐటీయూ ఆధ్వర్యంలో జాతీయ కార్మికుల కోరికల దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద కార్మికులు నిరసన చేపట్టారు. అనంతరం వినతిపత్రాన్ని తహసీల్దార్ షేక్.నాగూర్‌మీరాకు అందజేశారు.



వెలిగండ్లలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు



కొండపిలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు

కనిగిరి రూరల్: కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసే లేబర్ కోడ్‌ను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పీసీ కేశవరావు అన్నారు. కార్మికుల డిమాండ్స్ డే పురస్కరించుకుని బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా పీసీ కేశవరావు మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని రంగాల్లోని కార్మికులపై రాజకీయ వేధింపులు ప్రారంభించిందన్నారు. సీఐటీయూ నాయకులు బషీరా, కాంత కుమారి, సుకన్య, అచ్చమ్మ, పద్మ, ప్రసాద్, లక్ష్మయ్య, ఆనంద్, చెన్న కేశవులు, పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

హనుమంతునిపాడు: కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కార్మికుల సంఘ అధ్యక్షుడు ఉస్తేల గురవమ్మ, లక్ష్మీదేవి డిమ్మాండ్ చేశారు. కార్మికులు డిమాండ్స్ డే సందర్భంగా అంగన్‌వాడీలు, ఆశావర్కర్లు, వీఆర్ఏలు వ్యవసాయ కార్మిక సంఘ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు.

లింగసముద్రం: అంగన్‌వాడీ కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద సీఐటీయూ, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం జూనియర్ అసిస్టెంట్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. చిరుతోటి ప్రభావతి, వై.ప్రమీల, ఎస్‌కే షరీమా, వై. క్రిష్ణకుమారి, కె.సుగుణమ్మ, ఎస్ మాధవి, మధులత, ధనలక్ష్మి పాల్గొన్నారు.

**అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి**

వెలిగండ్ల: అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు రాయళ్ల మాలకొండయ్య కోరారు. అంగన్‌వాడీ కోర్కెల దినోత్సవం సందర్భంగా బుధవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ ఎం డానియేల్‌కు, ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని, నూతనంగా అమలులోకి తెచ్చిన మూడు క్రిమినల్స్ న్యాయ చట్టాలను నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. ముక్కు వెంకటలక్ష్మీ, రెడ్డెం తిరపతమ్మ, దొడ్డా హైమావతి, టి.జయప్రమీల, రెడ్డెం సరస్వతి, అన్నపురెడ్డి శారద తదితరులు పాల్గొన్నారు.

కొండపి(సింగరాయకొండ): కనీస వేతనాలు చెల్లించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ ఆధ్వర్యంలో తహసీల్దార్ బి.కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ లీడర్ గుంటూరు మస్తాన్ వందనం మాట్లాడుతూ మారుతున్న కాలానికి, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా అంగన్‌వాడీ జీతాలు పెంచాలని కోరారు.

## భూసారాన్ని బట్టి ఎరువులు వినియోగం



రైతులతో మాట్లాడుతున్న అధికారులు

టంగుటూరు: ప్రకృతి వ్యవసాయం, భూసార పరీక్షల ఫలితాల ఆధారంగా ఎరువులు వినియోగించాలని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి శైలజారాణి పేర్కొన్నారు. టంగుటూరు మండలంలోని జమ్ములపాలెం రైతు సేవా కేంద్రంలో జిల్లా వనరుల ఆధ్వర్యంలో బుధవారం రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులు ఎరువులు, పురుగు మందులు విచక్షణా రహితంగా వాడటం వల్ల నేల, గాలి, నీటి కాలుష్యంతోపాటు సాగు ఖర్చులు పెరిగి రైతుకు నికర ఆదాయం తగ్గిపోయిందన్నారు. ప్రస్తుత పరిస్థితులపై రైతులు అవగాహన కలిగి ఉండి రసాయనిక ఎరువులు, పురుగు మందుల వాడకం తగ్గించి సిఫారసు మేరకు మాత్రమే వినియోగించాలని తెలిపారు. సేంద్రియ ఎరువులు, జీవన ఎరువులు, జీవ శిలీంద్ర నాశినులు, వేప కషాయం లేదా వేప నూనే లాంటి ప్రకృతి వనరులను వినియోగించడంతో పాటు మేలైన యాజమాన్య పద్ధతులు పాటించి వ్యవసాయాన్ని లాభసాటిగా చేసుకోవాలని తెలిపారు. భూసార పరీక్ష కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు సుచరిత మాట్లాడుతూ.. మట్టి నమూనా తీసే విధానం, మట్టి పరీక్ష ఫలితాలను అనుసరించి ఎరువుల వాడకం, సమస్యాత్మక భూముల యాజమాన్యం గురించి వివరించారు. మండల వ్యవసాయాధికారి స్వర్ణలత మాట్లాడుతూ.. వ్యవసాయ శాఖ ద్వారా అమలు చేస్తున్న పథకాల గురించి వివరించారు. అనంతరం ప్రకృతి వ్యవసాయం, భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువుల వినియోగం గురించి తెలుగులో ప్రచురించిన కరదీపికలను రైతులకు అందజేశారు. జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి వెంకట శేషమ్మ, వీఏఏ ప్రావీణ్య, రైతులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



పొన్నలూరులో అవగాహన కల్పిస్తున్న వైద్య బృందం

పొన్నలూరు: సీజన్‌ల వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ డాక్టర్ రవికిరణ్ సూచించారు. పొన్నలూరులో బుధవారం ర్యాలీ చేపట్టి సీజనల్ వ్యాధులపై ప్రజలకు, పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవికిరణ్ మాట్లాడుతూ.. అడపాదడపా వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధులైన డెంగీ, మలేరియా, చికున్‌గున్యా, మెదడువాపు, ఫైలేరియా లాంటి వాధ్యులు సోకకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈ వ్యాధులను కలుగజేసే దోమల వ్యాప్తిని, ఉనికిని నివారించేందుకు తీసుకోవాల్సిన చర్యల గురించి ప్రజలు అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రజలు తమ ఇంటిని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నివాస ప్రాంతాలు, చేతిపంపుల వద్ద మురుగు నిల్వ లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది భాస్కర్, సురేష్‌బాబు, శ్రీనివాసరావు, జ్యోతి, సుజాత, హరిత, ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## తాగునీటి సరఫరాలో జాగ్రత్తలు తీసుకోవాలి



మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ విద్యాధరి

కందుకూరు: కందుకూరు మున్సిపాలిటీ పరిధిలో మంచినీటి సరఫరా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రస్తుతం వర్షా కాలం నేపథ్యంలో కలుషితం కాకుండా జాగ్రత్తలు పాటించాలని సబ్‌కలెక్టర్ విద్యాధరి సూచించారు. తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యంపై బుధవారం ఆమె మున్సిపల్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఫ్రీ క్లోరినేషన్ పరీక్షలు చేయడంతో పాటు ఎక్కడా ఇబ్బందులు లేకుండా ముందు జాగ్రత్తలు పాటించాలన్నారు. పట్టణంలోని నీటి సరఫరా సక్రమంగా ఉండేలా కృషి చేయాలన్నారు. అలాగే పారిశుద్ధ్యం విషయంలో నిర్లక్ష్యం వహించరాదని, సకాలంలో కాంపాక్టు బిన్స్‌లోని చెత్తను తొలగించి రోడ్లపై చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వాణిజ్య సముదాయాల ప్రాంతాల్లో రోడ్లపై చెత్త వేయనీయరాదని, చెత్త సేకరణ, చెత్తను పొడి, తడి చెత్తగా వేరు చేయడం వంటి కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అలాగే బ్లాక్ పాయింట్స్‌ను గుర్తించి నిరంతరం పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మామిడిలో సస్యరక్షణ చర్యలు అవసరం



మాట్లాడుతున్న ఉద్యానవన అధికారి జ్యోతి

ఉలవపాడు(కందుకూరు): మామిడిలో పంట కోత అనంతరం రైతులు తోటల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఉద్యానవనశాఖ అధికారి జ్యోతి రైతులకు సూచించారు. మండలంలోని చాకిచర్ల రైతు సేవా కేంద్రంలో బుధవారం మామిడి రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. పంట కోత పూర్తయిన తోటల్లో పాదుల నిర్వహించడం, సరైన సూర్యరశ్మి కోసం కొమ్మ కత్తిరింపులు చేసుకోవాలని సూచించారు. పునాస మామిడిలో పూత దశలో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలు వివరించారు. ఉద్యానవన శాఖలో 2024–25 ఖరీఫ్ సీజన్‌లో తోటల పెంపకం, హైబ్రిడ్ కూరగాయల పెంపకానికి సంబంధించి పలు రాయితీలు ఉన్నాయని, వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వీహెచ్ఏ యోగేస్, రైతులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు అడ్మిషన్ ఫీజు ఉచితం



విద్యార్థినికి అడ్మిషన్ అందజేస్తున్న ప్రిన్సిపాల్ రవికుమార్, అధ్యాపకులు

కందుకూరు: టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో చేరే ప్రతి విద్యార్థికి అడ్మిషన్ ఫీజు కింద చెల్లించే రూ.2వేల ఫీజును పూర్తిగా ప్రిన్సిపాల్, అధ్యాపకులే చెల్లిస్తారని పేద విద్యార్థులపై భారం లేకుండా ఉండాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ రవికుమార్ తెలిపారు. ప్రస్తుతం కాలేజీలో అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. అవకాశాన్ని కందుకూరు పరిసర ప్రాంత విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో అన్ని మౌలిక వసతులు, అనుభవం కలిగిన అధ్యాపక బృందం, విశాలమైన క్రీడా మైదానం, హాస్టల్ వసతి ఉన్నాయని చెప్పారు. ఇంటర్ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో చేరి బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని కోరారు. జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ ఓ వెంకటేశ్వర్లు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## చిన్నారులకు విధిగా టీకాలు వేయించండి

కనిగిరి రూరల్: నిర్ణీత సమయంలో చిన్నారులకు కచ్చితంగా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. స్థానిక దేవాంగనగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారుల వ్యాక్సిన్ కేంద్రాన్ని బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్ మాట్లాడుతూ వ్యాధి నిరోధక టీకాల ఆవశ్యకతను, వాటి వల్ల కలిగే లాభాలను తల్లిదండ్రులకు వివరించి చైతన్యవంతులు చేయాలన్నారు. టీకాలు వేయడం వల్ల, చిన్నారుల్లో వ్యాధి నిరోధక శక్తి పెరగడంతో పాటు, భవిష్యత్‌లో అనేక ప్రయోజనాలు ఉంటాయని వివరించారు. హెల్త్ సెక్రటరీ కె.లక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్త షాజిదా బేగం, సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## బడిఈడు పిల్లలంతా పాఠశాలల్లోనే ఉండాలి



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్

కనిగిరి రూరల్: బడిఈడు పిల్లలంతా పాఠశాలల్లోనే ఉండాలని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. పట్టణంలోని కాశిరెడ్డి కాలనీలో బుధవారం 'బడికి పోదారం రా' కార్యక్రమం ర్యాలీని విద్యా శాఖ, గుడ్ హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ విద్యతోనే అభివృద్ధి సాధ్యమని ప్రతి ఒక్కరూ తమ పిల్లలను విధిగా పాఠశాలలకు పంపించాలన్నారు. ఎంఈఓ యువీ నారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలతో విద్యాబోధన అందిస్తున్నట్లు చెప్పారు. తల్లిదండ్రులు విధిగా తమ పిల్లలను పాఠశాలకు పంపించాలని కోరారు. పారాలీగల్ వలంటీర్లు రమేష్, పి.నవకుమార్, మెప్మా ఆర్పీలు లీలావతి, ఎస్‌కే మిస్కిన్, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల గోల్డెన్ జూబ్లీ సంబరాలు



గోల్డెన్ జూబ్లీ సంబరాలు జరుపుకున్న పూర్వ విద్యార్థులు

కందుకూరు: జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 1973–74 విద్యా సంవత్సరంలో 10వ తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు తమ గోల్డెన్ జూబ్లీ సంబరాలను అత్యంత వైభవంగా జరుపుకున్నారు. సింగరాయకొండ రోడ్డులోని రవి గార్డెన్స్ ఇందుకు వేదికగా మారింది. 50 ఏళ్ల క్రితం కలిసి చదువుకున్న నాటి మిత్రులంతా ఒకచోట చేసి నాటి తీపి గుర్తులను నెమరువేసుకున్నారు. నాటి అల్లరి, చదువు చెప్పిన ఉపాధ్యాయులు, ఈ 50 ఏళ్లలో జీవితంలో అనుభవించిన కష్ట, సుఖాలను నెమరవేసుకుని సరదాగా గడిపారు. అలాగే ప్రతి ఏడాది కలవడం తమకు ఆనవాయితీగా వస్తుందని, అదే సందర్భంలో 10వ తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు తమ బ్యాచ్ తరుపున ఆర్థిక సాయం అందిస్తున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా ఈ ఏడాది 10వ తరగతిలో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన వారికి రూ.10,000, రూ.5,000 చొప్పున ఆర్థిక సాయం అందించారు. తమ గోల్డెన్ జూబ్లీ వేడుకలకు గుర్తుగా జ్ఞాపికలను అందజేశారు. నాటి పూర్వ విద్యార్థులు మంచిరాజు మురళీమోహన్, ముచ్చెర్ల ఉమామహేశ్వరరావు, సంధానిబాష, దోనవల్లి రమేష్, పామూరి శ్రీను, రామమ్మూర్తి, శశిధర్, ఉప్పుటూరి వరప్రసాదరావు, పువ్వాడి రమణయ్య పాల్గొన్నారు.

## పొగాకు సరాసరి ధర కేజీ రూ.304



టంగుటూరులో వేలంలో పాల్గొన్న వ్యాపారులు



కొండపిలో వేలం నిర్వహిస్తున్న సునీల్‌కుమార్

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో బుధవారం సరాసరి ధర రూ.304.24 నమోదైంది. వేలం కేంద్రానికి దావ గూడూరు, చింతలపాలెం, టంగుటూరు, జరుగుమల్లి, పాలేటిపాడు, సాదువారిపాలెం, జమ్ములపాలెం, తుమాడు గ్రామాల రైతులు 742 బేళ్లను వేలానికి ఉంచగా 653 కొనుగోలయ్యాయి. వ్యాపారులు వివిధ కారణాలతో 89 బేళ్ల తిరస్కరించారు. గరిష్ట ధర రూ.365, కనిష్ట ధర రూ.205, సరాసరి ధర రూ.304.24 పలికింది. వేలంలో మొత్తం 42 మంది వ్యాపారులు పాల్గొన్నారని నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

కొండపి(సింగరాయకొండ): కొండపి పొగాకు వేలం కేంద్రంలో బుధవారం చూర, ముక్క గరిష్ట ధర రూ.141 పలికిందని నిర్వహణాధికారి జి.సునీల్ కుమార్ తెలిపారు. చోడవరం, ముప్పవరం, చిన్నవెంకన్నపాలెం, వెన్నూరు గ్రామాల రైతులు 880 బేళ్ల వేలానికి తీసుకురాగా 386 బేళ్ల కొనుగోలయ్యాయి. వ్యాపారులు వివిధ కారణాలతో 185 బేళ్లను తిరస్కరించారు. కనిష్ట ధర రూ.59, సరాసరి ధర రూ.79.52 పలికింది.

**డాక్యుమెంట్స్ పోయినవి**

నెల్లూరు జిల్లా, కందుకూరు మండలం, పలుకూరు గ్రామ నివాసి అయిన శ్రీమతి **చెంబేటి లక్ష్మి w/o ఆంజనేయులు** అను నేను 04-07-2024 వ తేదీన నా భర్తతో మోటార్ బైకు పై పలుకూరు నుండి కందుకూరుకు వస్తుండగా సర్వే నెంబరు 149/2A, విస్తీర్ణం 166/2/3, డాక్యుమెంటు నెంబరు 371/2019, లింకు డాక్యుమెంటు నెంబరు 2740/2004 అను రెండు ఒరిజినల్ డాక్యుమెంట్లు పోయినవి. ఎవరికి అయిన దొరికిన ఎడల క్రింది నెంబరుకు తెలియజేయగలరు.

ఫోన్ నెంబరు : **9885769669.**